

# శిఖరారోహణము

హోరైజన్‌లోకి వెళిపోతున్న హీరోకిమల్లే, భారంగా అడుగులు వేసుకుంటూ, తలవంచుకు వెళ్ళిపోసాగాడు రాజు; నేపథ్య గీతం పాడుకుంటూ. అలా పోగాపోగా మెడ నొప్పెట్టి తల ఎత్తాడు. ఎదురుగా ఓపెద్ద గేటు కనబడింది. ఆ గేటు బార్లాతీసి వుంది. దగ్గరకు వెళ్లేసరికి దానిమీద ఓ చిన్నబోర్డు కట్టి వుంది. అందుమీద 'Please Keep the gate closed' అని రాసివుంది.

(గేటుమూసి మరీ వెళ్ళండి అని తాత్పర్యం)

రాజు అది చదివాడు. తక్షణం ఆపని చేయబోయాడు.

'స్వాతంత్ర్యము నా జన్మహక్కని' అనే పాట గుర్తుకు వచ్చింది.

ఎంత డబ్బుంటే మాత్రం, వీడెవడో చెబితే నేను చెయ్యడం ఏమిటి అనుకున్నాడు ఆగిపోయి. దారంట పోయేవాళ్ళకి ఇలాపనులు చెప్పడం తప్పుకాదూ?

ఇంకో క్షణం తరవాత బయల్దేర బోయి మళ్ళీ ఆగిపోయాడు. వెయ్యకపోతే అదేం ముప్పో! .... అసలు బాగుండదేమో .... మానర్స్ లేవు అంటారు. కల్చర్ సున్న అనుకుంటారు. మెద్రాసు వచ్చినపుడు మొవ్వారం వాడిలా ఉండడం బాగుండదు.

వేసేద్దాం అనుకున్నాడు గేటు తలుపుమీద చెయ్యివేసి.

వద్దుస్మీ అంది మనసు.

ఫరవాలేదులే అన్నాడు రాజు.

* * * *

'వాడెవడో ఇడియట్‌లా వున్నాడే....కాని వాట్ గ్రేట్ యాక్టర్! సందిగ్ధావస్థని గ్రాండ్‌గా పోర్ట్రే చేస్తున్నాడు' అన్నాడు ఆ యింటి పోర్టికోలో నిల్చున్న ప్రొడ్యూసరు.

ఆయనకి ఎడా పెడా నిల్చున్న సినీ వంది మాగధులు నవ్వారు.

"హామ్లెట్ వేసిన లారెన్స్ ఒలీవియర్ 'టుబి ఆర్ నాట్టుబీ' సీనులో వీడికన్న ఏం పొడిచేశాడు .... ఈ మహా నటుణ్ణి 'ది ఒలీవియర్ ఆఫ్ ఇండియా' అంటే తప్పేముంది. ఆ పోజు .... ఆ నటన ఎంత కొత్తగా ఉంది. నాకు బాగా నచ్చింది సార్ .... నేను మీకు ఎప్పుడూ చెపుతూ ఉంటాను. కొత్తనటులలో య్యాము పేలంట్లు ఉంటాయని. నామాటే రైటైంది. నేనే నెగ్గాను" అన్నాడు వందిమాగధులు.

"యాటదీ? .... యపుడనుకున్నారు ఆ యబ్బాయి. మీ యిట్టం వచ్చినట్టు కూ త్తన్నారు పాస్ పీసంతా' అంది ఆవెనుకనే నిల్చున్న లక్ష్మీనరసు కోపంగా.

"నోనో. మిస్ నర్సూ. అతను మంచి యాక్టరని చెబుతున్నాను వారికి. అంతే" అన్నాడు వందిమాగధులు.

'నివ్వేం సెప్పనక్కర్లే .... అదంతా నాయవ్వారం' అంది నరసు.

'అతన్నిట్టా పిలవ్వయ్యా' అన్నాడు-ప్రొడ్యూసరు.

వందిమాగధులు పిలిచాడు.

రాజు కొంచెం కంగారు పడ్డాడు. జంకుతూనే దగ్గరికి వచ్చాడు.

"అబ్బే .... నేనేం చెయ్యలేదండి. అయామే గేట్ ఈజే బోర్డు .... ఊరికినే బోర్డుని గేటేస్తున్నా,' అన్నాడు.

'ఏమిటీ?' అన్నాడు ప్రొడ్యూసరు.

"గార్డుని బేటేస్తున్నానండి .... అదికాదు మూటిని గేసేస్తున్నా" అన్నాడు రాజు తన అభిప్రాయాన్ని సాధ్యమైనంత స్పష్టంగా వివరిస్తూ.

'కంగారు గొడ్డు' అన్నాడు ప్రొడ్యూసరు జాలిగా నవ్వుతూ.

"యస్సార్. హేస్టీ యానిమల్' అన్నాయి వందిమాగధులు.

ఈలోగా రాజు స్థిమిత పడ్డాడు. ఇందాటికన్న మంచి వాక్యాలు ఆలోచించాడు.

"సారీ సార్! .... అయామ్ గేసింగ్ ది క్లోట్" అనేశాడు ధైర్యంగా నవ్వి.

ప్రొడ్యూసరుకి అభిమానం పెల్లుబికింది. 'వెరీగుడ్. వండ్రఫుల్ ఎక్స్‌ప్రెషన్ .... నువ్వు డైలాగులు రాయొచ్చు. నీ అయిడియా పసిగట్టేశాననుకో. గేటు మూసేస్తున్నానూ అంటావు. అంతేగా?'

రాజు హృదయంలో కృతజ్ఞత పరవళ్ళు తొక్కింది.

"యస్సార్. మరేండి – అదేండి. మూసు గేటే — అహ, గేసు మూసేటుత్తున్నాను."

హఠాత్తుగా ఆగిపోయాడు రాజు — అందరూ తన వంకే చిత్రంగా చూస్తున్నారని గమనించి.

అంతవరకు అతనికి కనబడకుండా ఆ లావుపాటి ప్రొడ్యూసరు చాటున ఉండి, నవ్వాపుకుంటున్న లక్షిన్నరసుకి జాలేసింది.

"రాజా నువ్వింక మాటాడకు. కూచోచెప్తా...."అని, "బాబాయ్, ఈఁడే నా మొగోడు. నే సెప్పినోడు" అంటూ ప్రొడ్యూసరుకి రహస్యం చెప్పింది.

నాగేశ్వర్రావుని పిక్చర్‌కి బుక్ చేయగలిగినంత సంతోషం వేసింది ఆయనకి.

"నువ్వేమిటి నేను చెప్పినవాడు. భేష్" అన్నాడు ఎంతో సంతోషంతో. రాజు నరసుని చూడగానే, సిగ్గు పడిపోయాడు.

'నువ్విక్కడి కెలా వచ్చావు' అన్నాడు సినేరియా జీర్ణంకాక. డైరెక్టరు పప్పులో కాలేశాడు అని పాఠకులు చివాట్లేసే ఘట్టాలు ఇలాటివే.

అయినా, లక్షిన్నరసు తను అక్కడి కెందుకు వచ్చిందో, తనకి డబ్బుగల బాబాయి ఎలా దొరికాడో చెప్పదలచుకోలేదు. చెప్పేందుకు ఏమీలేదు. అందుకని నవ్వేసింది.

బాబాయి ఉరఫ్ ప్రొడ్యూసరు గారు ఒహోహో అన్నారు హుషారుగా. 'ఫరవాలేదు గట్టివాడే....అమ్మాయి! నామాట విను రాత్రికే బొంబాయి మెయిలు ఎక్కెయ్యండి. తెల్లారేసరికి కొండెక్కి పెళ్ళాడేసి, రేపు సాయంత్రానికి చక్కారావచ్చు. ఓ రెండొందలకి చెక్కు రాసిస్తా నుండు' అంటూ లోపలి కెళ్ళాడు.

'అక్కర్లేదయ్యా. నాకాడ శానా డబ్బుండాదిలే' అంది నరసు.

* * * *

"వాట్? వాటీజ్ దిస్' అన్నాడు రాజు; గదిలోంచి మిగతా పాత్రలు ఫేడౌట్ అయిపోయి, తనూ నరసూ మిగలగానే.

'వాటో నేదు వీటూ నేదు బాబాయి సెప్పింది ఇనుకోనేదేటి. మనిద్దరం పెళ్ళి చేసుకుందారి. ఆనక సినిమాలో ఈరో యీరోయిను ఏసాలేద్దారిలే. మీ బామ్మకి ఉత్తరం ఆనక రాద్దారిలే" అంది నరసు.

"నో నో నరసూ నో నో. త్రీ టైమ్సు నో నో. నేను ఈ ఊరుకొచ్చి రెండ్రోజులైంది. రెండ్రోజుల్లోనూ బోల్డుమంది బోల్డుకథలు చెప్పారు. నేను యూస్‌లెస్ పనికి రానని కూడా చెప్పారు. ఇక్కడన్నీ టోకరాలు. నేను మావూరు వెళ్ళిపోతా. మాబామ్మకోసం బెంగెట్టుకున్నా. మాకు నాన్నావాళ్ల లేరుగదా. ఒకత్తే ఉంటుంది పాపం. అందుకని వెళ్ళి పోతాను" అన్నాడు సోఫాలోంచి లేవబోయి.

నరసు విరగబడి నవ్వి అతన్ని మళ్ళీ కూలేసింది.

"చూడు రాజా నువ్వు ఏ మూర్తాన నాకంటబడ్డావో నీమీద నాకు మనసైంది. నాకోసం సావుదెబ్బలు కూడా తిన్నావు. ఇంత మంచోడిని నిన్ను ఒగ్గనే ఒగ్గను. ఒకిటే మాట" అంది.

"బట్ అయామ్ యూస్‌లెస్—"

"అయ్యన్నీ నాకాడ సదవమోక. ఊళ్ళోకొచ్చిన కాణ్ణించి నివ్వు దగుల్బాజీల ఎంట తిరిగి, అంతా అంతే ననుకుంటున్నావు కాని, ఈడ ఎంతెంత కథలున్నాయో నీకుతెల్దు. ఇప్పిదేవ త్తానుండు" అంటూ నరసు లేచి అవతలగది గుమ్మం దగ్గరకెళ్ళి 'బాబోయ్! ఈ బుల్లోడు మనువూ గినువూ వొద్దని ఎల్లిపోతున్నాడు సూడు' అంది.

బాబాయి గర్జిస్తూ హాల్లో కొచ్చాడు. "ఏవిటీ వెళ్తాడూ. ఎక్కడి కిట. అవటా ఎల్లుండి షూటింగు ఉంది. ఎల్లుండి రిహార్సలు. మీయిద్దరికీ వేషాలున్నాయి. వేళకి రాపోతే ఎలాగ? నువ్వేం హీరోవనుకున్నావా లేటుగా రాడానికీ ఎగెయ్యడానికీను, కొత్తవాడివి. టైముకు రాపోతే యావజ్జీవ ఖైదు వేసేస్తారు," అన్నాడు.

రాజు బిక్కచచ్చిపోయి, నోరావలించి గుడ్లప్పగించి చూస్తూ కూర్చుండిపోయాడు.

"తెలిసిందా ఇంకా వెళ్ళిపోతానంటావా?" అంది నరసు.

"వెళ్ళిపోతానంటే యావజ్జీవ ఖైదు అయిపోయాక వదిలేస్తారా పోనీ" అన్నాడు రాజు ఆశవదలక.

ప్రొడ్యూసరు గారు హిందీ సినీ విలన్‌లా నవ్వి చుట్ట ముట్టించాడు.

"ఫూల్! నీకు తెలివితేటలున్నాయి గదా అవి కొంచెం వాడిచూడు. నువ్వు చేసే నేరానికి నిజంగా ఏం చేస్తారో ఆలోచించు నువ్వేచెప్పు. యావజ్జీవ ఖైదు పూర్తి అయ్యాక వదిలి పెడతా రంటావా?" అన్నాడాయన.

ఇష్టం లేకపోయినా ఆలోచించాడు రాజు.

"వదర్రండి....ఖచ్చితంగా ఉరిశిక్షవేస్తారు. నాకు తెలుసనుకోండి.

ఆఫ్ కోర్సు. నేను ఓస్టోరీ — 'ప్రేమపిట్టలు' అనే దాంట్లో ఇల్లాగే ఎండింగు రాశాను" అన్నాడు కొంచెం ధైర్యం తెచ్చుకుని.

ప్రొడ్యూసరు గారు ఆనందంతో ఉప్పొంగిపోయి, చప్పట్లు కొట్టాడు.

"శబాష్ బేటా శెబాస్....నీకు కొంత బుర్ర వుందనుకున్నాను గాని బొత్తిగా ఇంత బుర్రుందనుకోలేదు. నువ్వసలు డైరెక్టరు కావలసిన వాడివి. ఈ ఐడియా ఎవరికీ చెప్పక. నెక్స్ట్ పిక్చర్‌లో వాడేదాం. ఇంకేం క్వాలిఫికేషను లేకపోయినా ఇదొక్కటే చాలు సినిమాకి. మిగతావీ చప్పునే వంటబడతాయిలే. ఈలోగా మా నరసుని పెళ్ళాడి చిన్న వేషాలేస్తూ ఉండు. మా పిక్చరులోనే వున్నాయి రెండు. ఎల్లుండే స్టుడియోకి రండి. ముందు తిరుపతెళ్ళండి" అంటూ ఆయన గదిలోకి వెళ్ళిపోయాడు.

రాజుకి, హఠాత్తుగా ఓ కొత్త అయిడియా తట్టింది. తనకి నిజంగానే సినిమాల్లో వేషం దొరుకుతుందన్న మాట. ఎల్లుండే షూటింగుట. ఓరి బాబోయ్. వండ్రఫుల్ రోయ్! అనుకున్నాడు.

అనుకుని ఎగరబోయాడు. నరసు దగ్గరగా జరిగి అతన్ని స్థిమితపరచింది.

"నిజమే కదూ!" అన్నాడు నరసు మొహాన్ని క్లోజప్‌లో చూస్తూ.

'కాదూ?' అంది నరసు.

'ఔను' అన్నాడు రాజు.

చెంపమీద చెంప సూపరింపోజు అవుతున్న మత్తులో, 'ఇలా కలా ఇలా' అన్నాడు రాజు.

'వల' అంది నరసు అతని మెడచుట్టూ చేతులు వేస్తూ.

---

పి. ఎస్.

ఐదారు పేరాలపైన నరసు రాజాని సముదాయించే సీనులో 'మన పెళ్లయాక మీ బామ్మకు ఉత్తరం రాదాం' అంది. రాజుకి నాన్నలేడని, బామ్మేఉందని నరసుకు ఎలా తెలుసు? రాజుకి ఈ సంగతి తెలిస్తే, పాసార్థిగాడు పప్పులో కాలేశాడు అని సినిమాపేపర్లో ఏకేసేవాడా? కాడు. అయినా రాజు పుట్టుపూర్వాలూ అతని డబ్బు లక్షన్నరకీ కాపలాగా ఒక్క బామ్మముటుకే బతికుందన్న కిటుకూ లక్షిన్నరసుకి తెలుసని (వాళ్ళ బాబాయిద్వారా) పాసార్థికి తెలుసు.